క్లుప్తంగా

విద్యార్థులకు సన్మానం



పెబ్బేరు రూరల్: శ్రీతొగుట వీర క్షత్రీయ ఉద్యోగ సేవాసంఘం కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం 10వ తరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు కీర్తన, బానక్షిత, కార్తీక్, వైష్ణవి, పెద్ది దినేష్‌కుమార్, ఉజ్వల, జానకీరాములు, వినయ్‌కుమార్‌కు వనపర్తి పట్టణంలోని శ్రీ చౌడేశ్వరి ఆలయంలో సన్మానించి, పారితోషికం అందజేశారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా అధ్యక్షుడు శంకరయ్య మాట్లాడుతూ భవిష్యత్‌లో బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

వివరాల నమోదులో అలసత్వం తగదు



పాన్‌గల్: అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ప్రతి నెలకు సంబంధించిన వివరాల నమోదులో అలసత్వం తగదని ఐసీడీఎస్ పాన్‌గల్ సెక్టార్ సూపర్‌వైజర్ షాయిన్‌బేగం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కార్యకర్తల సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కేంద్రాల వారీగా రికార్డులను పరిశీలించి పౌష్టికాహారం, గుడ్లు, పాలు పంపిణీ వివరాల నమోదును పరిశీలించారు. వివరాల నమోదు సక్రమంగా చేపట్టని కార్యకర్తలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రాల నిర్వహణ, రికార్డుల నమోదు, పౌష్టికాహారం పంపిణీ పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అమర జవాన్‌కు ఘన నివాళి



అడ్డాకుల: వేములకి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ ఉంద్యాల కృష్ణారెడ్డి 2001లో ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయాడు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని సీఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ బంగారు రాజు, ఏఎస్‌ఐ గోపీ గ్రామానికి వచ్చి కృష్ణారెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కృష్ణారెడ్డి తల్లి నీలమ్మను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యాట సత్యం, హెడ్ కానిస్టేబుల్ శివారెడ్డి, కుటుంబ సభ్యులు బాల్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, సంజీవరెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రిటైర్డ్ పోస్టుమాస్టర్‌కు..

కొల్లాపూర్: రిటైర్డ్ పోస్టుమాస్టర్ పుట్టపాగ సిద్ధన్న(65) శుక్రవారం గుండెపోటుతో మరణించారు. కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాల్లో సుదీర్ఘ కాలం పోస్టుమాస్టర్‌గా సేవలు అందించారు. సిద్ధన్న మృతిపై ఎమ్మార్పీఎస్‌తో పాటు పలు రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు సంతాపం ప్రకటించారు.

'బడిబాట' విజయవంతం చేయాలి

అడ్డాకుల: జూన్ 3 నుంచి 19 వరకు జరిగే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరు కృషి చేయాలని జిల్లా అటవీశాఖ అధికారి, మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో శుక్రవారం అన్ని పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశంలో మాట్లాడారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ నాగయ్య, ఎంపీఓ విజయ్, ఏపీఎం సుధీర్, హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

భూమి కేటాయించాలని వినతి



కొల్లాపూర్ రూరల్: మండలంలోని కుడికిల్ల గ్రామానికి చెందిన పాలమూరు-రంగారెడ్డి నిర్వాసిత మాదిగలు తమ కాలనీకి సమీపంలో ఉన్న పట్టాభూమిని కొనుగోలు చేసి ఇండ్ల స్థలాలకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తు శుక్రవారం స్థానిక తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామ ఎంపీటీసీ కోంఢ్ర బిచ్చయ్య, దండోరా రాష్ట్ర నాయకులు బచ్చలకూర స్వామి మాట్లాడుతూ ప్రభుత్వం భూమిని కొనుగోలు చేసి ప్రాజెక్టులో భూములు కోల్పోయిన మాదిగలకు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నిర్వాసిత మాదిగలు జంగం రాముడు, పరమేష్, వినోద్ పకీరయ్య, కన్నయ్య, దేవమ్మ, ఎల్లమ్మ, రాముడు, శేఖర్, బాలపీరు, కృష్ణయ్య, నాగేశ్వరావు, తదితరులు ఉన్నారు.

విత్తనాలు, ఎరువులు అందేనా?

- ఖరీఫ్ సీజన్‌కు కసరత్తు
- మండలంలో సాగు భూమి 7,600 ఎకరాలు
- పంటలను సాగు చేస్తున్న 11,704 మంది రైతులు



సబ్సిడీ టార్పాలిన్ కోసం వ్యవసాయ కార్యాలయం వద్ద బారులు తీరిన రైతులు (ఫైల్)

వీపనగండ్ల: మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో ఈ వానాకాలం సీజన్‌లో భీమా, జూరాల కాల్వలతో పాటు చెరువులు, బావుల కింద దాదాపు 7,600 ఎకరాల్లో పంట సాగు చేసే అవకాశం ఉంది. ఈ మేరకు రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందిస్తేనే దిగుబడి సక్రమంగా వచ్చే పరిస్థితులు ఉంటాయి. గతేడాది వ్యవసాయ అధికారులు ముందస్తు ప్రణాళికను రూపొందించి రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సరఫరా చేశారు. తీవ్రభావ పరిస్థితుల వల్ల చెరువులు, కుంటలు ఎండిపోవడం, కాల్వల కింద రెండో పంట వేయకుండా క్రాప్ హాలీడే ను ప్రకటించడంతో ఈ వానాకాలంలోనైనా పంటలను సకాలంలో సాగు చేయాలన్న ఉదుద్దేశ్యంతో రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు.

'రైతుబంధు'లో లబ్ధి పొందిన రైతులు

మండలంలో 11,704 మంది రైతులు రైతుబంధు పథకానికి అర్హులు కాగా రూ.15.46 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపించారు. అందులో 10,900 మంది రైతులు మాత్రమే రైతుబంధుకు అర్హత సాధించడంతో వారి ఖాతాల్లో రూ.12.85 కోట్లు జమ చేశారు.

రైతుబీమాకు..

మండలంలో 11,704 మంది రైతులు ఉండగా.. వారిలో రైతు బీమాకు అర్హత పొందిన వారు 7,129 మంది ఉండగా.. 4,132 మందికి అర్హత లేదు. గతేడాది రైతుబీమాకు దరఖాస్తు చేసుకున్న 25 మంది రైతులు చనిపోతే బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున అందించారు.

8 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు

మండలంలో రైతులు సాగు చేస్తున్న పంటలకు 8 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం అని అధికారులు గుర్తించారు. అందులో యూరియా 3,500 మెట్రిక్ టన్నులు, డీఏపీ 1,500 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 3 వేల మెట్రిక్ టన్నులు అవసరం అవుతుందని అధికారులు ప్రతిపాదనలు పంపించారు.

గత ఖరీఫ్‌లో..

గతేడాది 5,500 ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు. 500 ఎకరాల్లో కందులు, 150 ఎకరాల్లో వేరుశనగ, 450 ఎకరాల్లో ఆయిల్‌ఫాం తోటలు, 6వేల ఎకరాల్లో మామిడి తోటలను రైతులు సాగు చేశారు. పంటల సాగుకు అనుగుణంగా అధికారులు ఎరువులు, విత్తనాలు సప్లై చేయించాలని అన్నదాతలు కోరుతున్నారు.

మరమ్మతు అవసరం



మండలంలో జూరాల, భీమా కాల్వలు పాడవడం వల్ల చివరి ఆయకట్టు పొలాలకు సాగునీరు అందడం లేదు. కాల్వ మరమ్మతు కోసం అధికారులకు ఎన్నోమార్లు విన్నవించినా స్పందించడం లేదు. దీంతో చివరి ఆయకట్టు పంటలు ఎండిపోయాయి. ఈసారైన అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి కాల్వల మరమ్మతు చేయించాలి.

– హౌలాలి, మాజీ సర్పంచ్, సంగినేనిపల్లి

సబ్సిడీలు అందించాలి



సబ్సిడీలో ఎరువులు, విత్తనాలు రైతులకు అందించినప్పుడే పెట్టుబడులు తగ్గి రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించడం ద్వారా అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తుంది. ప్రభుత్వమే రైతుల అవసరాల మేరకు ఎరువులు, విత్తనాలు సబ్సిడీ ద్వారా అందజేయాలి.

– రుక్కువర్ధన్‌రెడ్డి, రైతు, వీపనగండ్ల

సలహాలు పాటించాలి



ఫర్టిలైజర్ షాపుల వారి మాటలు నమ్మి పంటలకు అధికంగా క్రిమిసంహారక మందులు వాడటం వల్ల దిగుబడి పడిపోయే అవకాశం ఉంది. రైతులు వ్యవసాయ అధికారులు సూచనలు పాటించి మేలు రకమైన విత్తనాలనే కొనుగోలు చేయాలి. పంటల దిగుబడికి శాస్త్రీయ పంటల విధానం అలవర్చుకోవాలి.

– దాకేశ్వర్‌గౌడ్, ఏఓ, వీపనగండ్ల

'ఆశాలకు నష్టం చేకూర్చొద్దు'



ఏఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెబ్బేరు రూరల్: ఆశాలకు నష్టం కలిగించే పరీక్ష విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని తెలంగాణ ఆశా వర్కర్ల యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలోని డీఎంహెచ్‌ఓ ఆఫీస్, కలెక్టర్ ఆఫీస్ ఏఓ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరారు. ఆశా వర్కర్లకు నేటికి కనీస వేతనం లేదని, వారికి న్యాయం చేయాలన్నారు. చదువుకు సంబంధం లేకుండా కొంతమంది ఆశావర్కర్లు ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఒక వైపు పని భారంతో ఇబ్బంది పడుతుంటే రిటైర్మెంట్ అయ్యే వయస్సులో పరీక్ష పెడతామనడం సరైన విధానం కాదన్నారు. జూన్ 1న పీహెచ్‌సీల్లో మెడికల్ ఆఫీసర్లకు వినతి పత్రాలు ఇవ్వాలని, జూన్ 13న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బొబ్బిలి నిక్సన్, ఆశావర్కర్స్ బుచ్చమ్మ, సునీత, దేవమ్మ, శాంతమ్మ, శ్యామల, పార్వతి, అర్చన పాల్గొన్నారు.

నిందితులను వెంటనే అరెస్టు చేయాలి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సంగెం సూర్యారావు

అడ్డాకుల: మహబూబ్‌నగర్‌లోని వైన్ షాపు వద్ద శ్రీకాంత్ యాదవ్‌పై దాడి చేసిన వారిలో తప్పించుకుని తిరుగుతున్న ఇద్దరు నిందితులను వెంటనే అరెస్టు చేయాలని బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు డిమాండ్ చేశారు. అడ్డాకుల మండలం బలీదుపల్లిలోని శ్రీకాంత్ యాదవ్ తల్లిదండ్రులను శుక్రవారం ఆయన పరామర్శించారు. శ్రీకాంత్ యాదవ్‌పై దాడి ఘటనను ఖండిస్తూ తప్పించుకుని తిరుగుతున్న ఇద్దరు నిందితులకు రాజకీయ అండ ఉండటంతోనే పోలీసులు వారిని అరెస్టు చేయడం లేదని ఆరోపించారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా పోలీసులు వెంటనే వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే దాడి ఘటనను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం కోసం పోరాటం చేస్తామని తెలిపారు. నిందితులను పట్టుకునే వరకు బాధిత కుటుంబం తరుపున పోరాటం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ సాగర్, కోకన్వీనర్ సవారి సత్యం, పెద్దమండడి బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు వేణుయాదవ్, మాజీ ఎంపీపీ దయాకర్, శ్రీధర్, మహేష్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

బీజేపీ గెలుపు ప్రజాస్వామ్యానికి చేటు



మాట్లాడుతున్న సాగర్

పెబ్బేరు రూరల్: ఇండియా కూటమి గెలుపుతో ప్రజాస్వామ్య వ్యవస్థ బలపడుతుందని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాగర్ అన్నారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎంవైఎస్ ఫంక్షన్ హాల్లో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతుందని, రాజ్యాంగాన్ని మార్చడం, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు రద్దు చేసే ఆలోచన చేయడం, ప్రశ్నించే గొంతుకలను జైల్లో పెట్టి నిర్బంధించడం చేస్తారన్నారు. లౌకిక వ్యవస్థ అనేది లేకుండా చేయడం బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నైజం అన్నారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనలు భవిష్యత్తులో పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా అప్పజెప్పే విధంగా ప్రయత్నిస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎండీ జబ్బార్, మేకల ఆంజనేయులు, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి



గోప్లాపూర్‌లో చెట్లకు నీరు పడుతున్న ఏపీఓ



కిష్టంపల్లిలో మొక్కలకు నీటిని అందిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

అమరచింత: గ్రామాల్లో హరితహారం ద్వారా నాటిన మొక్కల సంరక్షణ కోసం ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. చెట్టుచెట్టుకు నీరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కిష్టంపల్లి, సింగంపేటలో ఎంపీడీఓ మొక్కలకు నీటిని అందించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది ద్వారా మొక్కల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ప్రధాన రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలతో పాటు ప్రార్థన మందిరాలు, ఆలయాలు, పాఠశాలల ఆవరణంలో నాటిన మొక్కలు వాడుముఖం పట్టకుండా రోజువారి నీటిని అందిస్తున్నామని తెలిపారు.

పాన్‌గల్: నర్సరీలు, హరితహారంలో నాటిన మొక్కలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని సంరక్షించాలని ఏపీఓ కుర్మయ్య అన్నారు. శుక్రవారం చెట్టు, చెట్టుకు నీరు కార్యక్రమంలో భాగంగా మండలంలోని గోప్లాపూర్ నర్సరీని పరిశీలించి, రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలకు నీరు పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలకు క్రమం తప్పకుండా వాటర్ క్యూరింగ్ చేయాలన్నారు. నర్సరీల్లో జీపీ లక్ష్యానికి అనుగుణంగా మొక్కలను సిద్ధం చేసుకోవాలన్నారు. ఉపాధి కూలీల మస్టర్లను ఆయన పరిశీలించారు. పనులకు వచ్చే రోజు వారీ కూలీల సంఖ్యను పెంచాలని, పనుల వద్ద నీడ, నీటి వసతిని తప్పక ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో టీఏ సురేష్, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డు అసిస్టెంటు పాల్గొన్నారు.

ముగిసిని వేసవి క్రీడా శిబిరం

గోపాల్‌పేట: మండల కేంద్రంలో నెల రోజుల క్రితం ప్రారంభించిన వేసవి ఫుట్‌బాల్ క్రీడా శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి జిల్లా పరీక్షల అధికారి గణేష్‌కుమార్, కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రెటరీ చంద్రశేఖర్, పాఠశాల గేమ్స్ సెక్రెటరీ సురేందర్‌రెడ్డి హాజరయ్యారు. కోచింగ్ తీసుకున్న విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో క్రీడల్లో ప్రతిభ కనబర్చి పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు.

తండాల్లో ఎక్సైజ్ పోలీసుల దాడులు

- 37 లీటర్ల సారా, 427 కిలోల నల్లబెల్లం స్వాధీనం
- ఏడుగురిపై కేసు నమోదు



సారా, నల్లబెల్లంతో పట్టుబడిన వారితో ఎక్సైజ్ పోలీసులు

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండా, శాగాపూర్‌తండాల్లో శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి 37 లీటర్ల సారా, 427 కిలోల నల్లబెల్లం స్వాధీనం చేసుకొని ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ సారా తయారీ నిషేధం కోసమే దాడులు నిర్వహిస్తున్నామని, సారా తయారీని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేదన్నారు. సారా తయారీదారులు ప్రభుత్వం కల్పించే ఉపాధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తయారీదారులపై కేసులు నమోదు చేస్తామని, పద్ధతి మార్చుకోకపోతే పీడీ యాక్టు అమలు చేస్తామన్నారు. ఆయా తండాల్లో బెల్లం పాకంను ధ్వంసం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. తెల్లరాళ్లపల్లితండాలో కేతావత్ కైక, ముడావత్ లక్ష్మి, ముడావత్ హన్మి, ఇస్లావత్‌బాబీ, ఇస్లావత్ బొజ్జమ్మ, శాగాపూర్‌తండాలో నేనావత్ శంకర్, నేనావత్ లాలుపై కేసులు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. తండాలో దాడులు నిర్వహిస్తున్నారని తెలిసి చాలా మంది ఇళ్లకు తాళాలు వేసుకుంటే వారి సమక్షంలో తాళాలు తీశాము తప్పా ఎక్కడ ధ్వంసం చేయలేదని సీఐ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు దాడులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కొత్తకోట సీఐ కరుణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బాలకృష్ణారెడ్డి, డీటీఎఫ్ ఎస్‌ఐ విశ్వనాథం, ఎస్‌ఐలు సంధ్యారాణి, కృష్ణకాంత్, సృజనకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం విక్రయదారులపై కఠిన చర్యలు

గ్రామాల్లో చాలా మంది కిరాణం షాపుల వారు బెల్లం విక్రయం మానుకోవాలని, లేనిచో వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కిరాణం షాపుల్లో నల్ల బెల్లం విక్రయంతోనే తండాల్లో సారా తయారీ జరుగుతుందని పేర్కొన్నారు.

ఉపాధి చూపకుండా దాడులా..

ఎక్సైజ్ పోలీసులు సారా తయారీ పేరుతో తండాల్లో నిర్వహించే దాడులు సరికాదని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ అన్నారు. సారా తయారీ చేసే వారికి ప్రభుత్వం ఉపాధి చూపకుండా దాడులు చేయడం ఏమిటి అని ఆయన అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికీ తండాల్లో 70 శాతం మంది తయారీని మానుకున్నారన్నారు. వలస వెళ్లి ఇళ్ల వద్ద ఉన్న కొంతమంది వృద్ధులు, దివ్యాంగులు ఉంటే వారే తయారీ చేస్తున్నారని, ఇళ్లు, తాళాలను ధ్వంసం చేయడం సరికాదన్నారు. సారా తయారీకి మేము అనుకూలం కాదని, కానీ ఉపాధి చూపిన తర్వాతనే దాడులు చేయాలన్నారు. లేనిచో గిరిజనుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

విద్యార్థులకు విద్యాదీవెన పథకం

శాంతినగర్: అలంపూర్ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన నాయీబ్రాహ్మణ విద్యార్థులకు విద్యాదీవెన పథకం ద్వారా బహుమతుల ప్రదానం చేయనున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, శాంతినగర్ పట్టణ అధ్యక్షుడు అశోక్‌కుమార్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతినగర్‌లోని కన్యకాపరమేశ్వరి కల్యాణమండపంలో శనివారం మధ్యాహ్నం 1 గంటకు సమావేశం ఉంటుందన్నారు. ఆయా మండలాలకు చెందిన నాయీబ్రాహ్మణ విద్యార్థులు పదో తరగతి, ఇంటర్‌లో ఎక్కువ మార్కులు సాధించిన వారికి బహుమతులు ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరైన ప్రతి నాయీబ్రాహ్మణ విద్యార్థికి బహుమతులు అందజేస్తామన్నారు. ఈ విషయమై అన్ని మండలాలకు చెందిన నాయీబ్రాహ్మణసంఘం అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు సమాచారం అందించాలని సూచించారు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు అవసరం



శాగాపూర్‌లో ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ అఖిల

పాన్‌గల్: ఖరీఫ్ సీజన్‌లో రైతులు విత్తనాల కొనుగోలు విషయంలో తగు జాగ్రత్తలు అవసరమని వ్యవసాయ అధికారులు రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని మంగళ్లపల్లి, మల్లాయిపల్లి, జమ్మాపూర్, శాగాపూర్, కిష్టాపూర్ గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుల అవగాహన సదస్సుకు వారు హాజరయ్యారు. విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, పాకెట్లపైన తయారీ, గడువు తేదీ, మొలకెత్తే శాతం వాటిని సరిచూసుకొని వ్యవసాయ శాఖ అనుమతులు ఉన్న డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు సమయంలో తప్పక రశీదు పొందాలని సూచించారు. నిర్దేశించిన ధరలకు కాకుండా ఎక్కువ ధరలకు విక్రయిస్తే అధికారుల దృష్టికి తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు నరేష్, శైలాజ, నరేష్, అఖిల, మహేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

ధూమపానానికి వ్యతిరేకంగా ఉద్యమిద్దాం



కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్ ఆసియా బేగం తదితరులు

కొత్తకోట రూరల్: పొగాకు వాడకం వల్ల అనారోగ్య సమస్యలు ఎక్కువగా ఉంటాయని, పొగాకు వినియోగం నిర్మూలించేందుకు అందరూ కలిసి రావాలని డాక్టర్ అసియాబేగం పిలుపునిచ్చారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆసియా బేగం మాట్లాడుతూ చాలా మందికి పొగాకు వ్యసనం కౌమారదశలో లేదా యవ్వనంలో ప్రారంభమవుతుందన్నారు. పొగాకుతో తయారు చేసే సిగరెట్, బీడీ, ఇతర పదార్థాలను వాడటం వలన శ్వాసకోస వ్యాధులు వస్తాయని, ఊపిరితిత్తులను దెబ్బతీస్తుందని, దీర్ఘకాలికంగా అస్తమా, గుండెపోటు, గొంతు పాడవటం, నోరు చెడిపోవడంతో పాటు క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. యువత సిగరేట్లకు దూరంగా ఉండటం మంచిదన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నందకిషోర్ ఉన్నారు.

పాన్‌గల్: స్థానిక పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కేతేపల్లిలో పొగాకు వాడకం, ధూమపానం ద్వారా సంభవించే రోగాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పొగాకులో ఉన్న నికోటిన్ అత్యంత ప్రమాదమైనదని, పొగాకు నమలడం వలన నోటి క్యాన్సర్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. అనంతరం పొగాకు, గుట్కాలు వాడాకాన్ని నిషేధిస్తామని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంచందర్, శ్రీలక్ష్మి, ఆశా కార్యకర్తలు కవిత, సంధ్య, చిన్నమ్మ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.



కేతేపల్లిలో..

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం వైద్యాధికారి వినీల పట్టణ ప్రజలతో పొగాకు నిషేధంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, ఏఎన్‌ఎం వెంకటమ్మ, వెంకటనర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: పొగాకును సమాజం నుంచి పూర్తిగా వెలివేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మండల వైద్యాధికారులు లక్ష్మీనారాయణ, డా.శబరి అన్నారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కేశవులు, రాఘవేందర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



వీపనగండ్లలో పొగాకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



పెబ్బేరులో పట్టణ ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యాధికారులు

రోడ్డు నిబంధనలు పాటించాలి

మానవపాడు: రోడ్డు నిబంధనలు పాటిచాలని ఎస్ చంద్రకాంత్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మద్యం తాగి వాహనాలు నడుపరాదని, రోడ్డు పరిమితికి మించి వాహనాల్లో ప్రజలను తరలించరాదని సూచించారు. త్రిబుల్ రైడింగ్ చేయరాదన్నారు. తనిఖీలో పోలీస్‌లు ఉన్నారు.

ఇంట్లో చోరీ: కేసు నమోదు

గద్వాల క్రైం: తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన శుక్రవారం పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణ ఎస్‌ఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం పట్టణంలోని మోమిన్ మహెల్లా కాలనీకి చెందిన జునేద్ కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి పట్టణంలోని బంధువుల వివాహ వేడుకలకు వెళ్లారు. ఈ క్రమంలో గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి రూ.60వేల నగదు, రూ.32వేల విలువైన సామగ్రిని ఎత్తుకెళ్లారు. అనంతరం ఇంటికెళ్లి చూడగా చోరీ చేసినట్లు గుర్తించి వెంటనే పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.